# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమయ్యి, పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.
- ❖ విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కట్టుబడి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందని విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు.
- ❖ సంచార్ సాథీ మొబైల్ యాప్ ద్వారా సెల్‌ఫోన్ వినియోగదారులు మారుమూల ప్రాంతాల్లో కూడా సిగ్నల్స్ పొందవచ్చని టెలికం అదనపు డీజీ రాజారెడ్డి వెల్లడించారు.
- ❖ "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమయ్యి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి కేబినెట్ సమావేశ వివరాలను వెల్లడించారు. 2024-25 ఖరీఫ్ ధాన్యం సేకరణకు 700 కోట్ల రూపాయల రుణాలు పొందడానికి మార్క్ ఫెడ్ కు అనుమతి ఇచ్చినట్టు మంత్రి పేర్కొన్నారు. ఫెర్రో అల్లాయిస్ కంపెనీకి సంబంధించి విద్యుత్ సబ్సిడీని మరో ఆరు నెలలు పొడిగించారు. 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ లను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

=====================

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం 11 వేల 440 కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడం పట్ల విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ ప్యాకేజీనే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీల జోడీతో స్టీల్ ప్లాంటుకు మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని అన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని అన్నారు.

=====================

సర్వీస్ ప్రొవైడర్లు, నెట్‌వర్క్‌తో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో మొబైల్ వినియోగదారులు సిగ్నల్స్ పొందవచ్చని భారత టెలికం శాఖ అదనపు డీజీ రాజారెడ్డి వెల్లడించారు. కేంద్ర టెలికం శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈరోజు ఢిల్లీలో డిజిటల్ భారత్ నిధి (DBN) సంచార్ సాథీ మొబైల్ యాప్‌లను ప్రారంభించగా... ఆ కార్యక్రమంలో రాజారెడ్డి దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం DBN ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో సర్వీసు ప్రొవైడర్లు భాగస్వాములుగా ఉన్నాయని చెప్పారు. దీని ద్వారా ఏ మొబైల్ నెట్‌వర్క్ వినియోగదారులైనా మారుమూల ప్రాంతాల్లో కూడా అక్కడి సర్వీస్ ప్రొవైడర్స్‌తో సంబంధం లేకుండా సిగ్నల్స్ పొందవచ్చని పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఇతర అధికారులతో ఈరోజు ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని విజయంతం చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. 12 నెలల పాటు నిర్వహించే కార్యక్రమం కోసం నెలకొక ఇతివృత్తంతో ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు.

విరామం

=====================

తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈరోజు దొరవారి సత్రం మండలం నేలపట్టులోని పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. రేపటి నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ - 2025 జరగనున్న నేపథ్యంలో సందర్శకుల కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. నేలపట్టు పక్షుల కేంద్రం వద్ద పర్యాటకులకు అవసరమైన భద్రత తదితర ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన ఈరోజు ఒక ప్రకటన విడుదల చేస్తూ... ప్రతి ఇంటర్న్ షిప్ నకు 12 నెలల పాటు శిక్షణ ఇస్తూ, నెలవారీ సహాయం కింద 4 వేల 500 రూపాయలు, పరిశ్రమల ద్వారా 500 రూపాయలు అందజేస్తారని చెప్పారు. ఇంటర్న్ షిప్ పూర్తయ్యాక

ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో ఉపాధి అవకాశం కల్పించబడుతుందన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ తదితర అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపుగా pminternship.mca.gov.in వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు.

=====================

వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అనంతపురం జిల్లా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో రోడ్డు భద్రాతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే నష్టాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన తెలిపారు.

=====================

భారత గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె భీమవరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవ వేదిక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం, అతిధులకు, ఆహ్వానితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాల రూపంలో ప్రదర్శన ఏర్పాటు చేయాలని, ఎగ్జిబిషన్ స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ, విద్యుత్, మునిసిపల్, పోలీసు, సమాచార శాఖ, తదితర శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

=====================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2 వరకు జరిగే రెండవ విడత లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (LCDC)లో ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కే. పద్మావతి ఆదేశించారు. ఇందులో భాగంగా పట్టణ, గిరిజన, గ్రామీణ ప్రాంతాలన్నింటిలో నివసిస్తున్న ప్రతి ఒక్కరిని ఆశా, ఎఎన్ ఎం పరీక్షించి, అనుమానిత కేసులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారికి సూచించాలని చెప్పారు. వైద్య అధికారి నిర్ధారణ తరువాత మల్టీ డ్రగ్ థెరపీ (MDT) మందులను ఉచితంగా ఇస్తారని తెలియజేశారు.

=====================
=====================